879) మలహరి / హిందోళ

ప॥ ఒక్కొక్కసతినడుమ ఒక్కొక్క రూపు గైకొని। యెక్కువైతివి కృష్ణా నిన్నెట్లనమ్మేదిరా॥

చ॥ మాటలాడే వొకతెతో మళ్ళిచూచే వొకతెను। వోటలేక నవ్వు నవ్వేవు వొకతెతోను।
కూటువై గొల్లెతలము గుంపుగూడున్నారమిదే। యేటిది నీమోహ మింక నెందని నమ్మేదిరా॥

చ॥ కన్నుగీటె వొకతెకు కాగిలించే వొకతెను। వెన్నదిన్న మోవిచ్చేవు వేరొకతెకు।
వున్నతి రాసక్రీడ లున్నార మిందరము। ఇన్నిటిలో నీవలపు యెందని నమ్మేదిరా॥

చ॥ తమ్మవెట్టే వొకతెకు తగమెచ్చే వొకతెను। సమ్మతించ జేశొకతె చన్ను లంటేవు।
యెమ్మెల శ్రీవేంకటేశ ఇందరి మమ్ము గూడితి-। విమ్మల నే నమ్మితిగాకెటుల నమ్మేదిరా॥